సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి



వైవీ సుబ్బారెడ్డికి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. వారిద్దరూ కొంత సేపు దక్షిణ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని వాసుపల్లి ధీమా వ్యక్తం చేశారు. వైవీ సుబ్బారెడ్డిని కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

శివాలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పరమశివుడికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: కార్తీక మాసం నాలుగో సోమవారం పురస్కరించుకొని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నియోజకవర్గ పరిధిలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. శివలింగానికి క్షీరాభిషేకం చేశారు. ప్రతి సోమవారం మహాశివుని దర్శించుకోవడం తనకెంతో ఇష్టమని, కార్తీక మాస పర్వదినాన శివలింగ దర్శనం మహాభాగ్యమన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అల్లిపురం: చిరుధాన్యాలతో ఆరోగ్యం మెండు అంటూ విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కళాశాల దత్తత గ్రామాల్లో వారు చిరుధాన్యాల వలన కలిగే లాభాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, రీజనల్ జాయింట్ డైరెక్టర్, జోన్–1, డాక్టర్ యస్.శోభారాణి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 14వ తేదీ వరకు ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అసోసియేట్ ఆఫీసరన్ డాక్టర్ గీతాంజలి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంలో చేర్చుకోవడం వలన ఆరోగ్య సిరి కలుగుతుందన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

అల్లిపురం: మిసెస్ ఏవీఎన్ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు స్పందన ఏర్పడింది. కళాశాల ప్రిన్సిపాల్ టీవీ మురళీ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో వివిధ సంస్థలు విద్యార్థులకు ఉద్యోగ అవకాశం కల్పించాయి. ఈ జాబ్‌మేళాలో 60 మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా 20 మందికి ఉద్యోగ అవకాశం పొందగలిగారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీపీఓ ఎం.వెంకటేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

'విక్టోరియా'కు 'సౌర'భం



ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న సౌర విద్యుత్ ప్రాజెక్టు



సెంటినరీ బ్లాక్



ఇది కదా అభివృద్ధి

- ప్రగతి పథంలో ప్రసూతి ఆస్పత్రి
- సోలార్ వెలుగులు
- హైరిస్క్ వార్డులు, ఏసీ పడకలు
- గర్భిణులకు, బాలింతలకు మెరుగైన సేవలు

మొత్తం పడకలు : 250
నిర్మాణంలో ఉన్నవి : 20
గైనిక్ ప్రొఫెసర్లు : నలుగురు
రోజువారి ఓపీకి వచ్చేవారు :350 మంది

మహారాణిపేట : ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏకైక ప్రసూతి ఆస్పత్రిగా పేరొందిన ప్రభుత్వ విక్టోరియా (ఘోష) ఆస్పత్రి ప్రగతి పథంలో దూసుకుపోతోంది. లేబర్ రూమ్ నాణ్యత ఆధారంగా ఇప్పటికే లక్ష్యా నేషనల్ సర్టిఫికెట్ పొందింది. ప్రసూతి, నవజాతి శిశువుల మరణాలు, అనారోగ్యాలను తగ్గించడం లక్ష్యంగా లక్ష్యా కార్యక్రమాలు అమలు చేశారు. తాజాగా సౌర విద్యుత్ (సోలార్) ఉత్పాదనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. **దీని వల్ల ఆస్పత్రికి విద్యుత్ ఖర్చులు** ఆదా అవుతున్నాయి. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో 250 పడకలు ఉన్నాయి. అధికారికంగా 177 పడకలు ఉండాలి. కాని డెలివరీ సంఖ్య పెరగడంతో మరో 73 పడకలు అదనంగా ఏర్పాటు చేశారు. ఇంకా డెలివరీ సంఖ్య పెరుగుతుండడంతో మరో 20 పడకల నిర్మాణం చేపట్టారు. హైరిస్క్ ప్రసూతి వార్డులో పూర్తి ఎయిర్ కండీషన్, ఎటాచ్‌డ్ మరుగుదొడ్లు, పడకలకు కావలసిన అన్ని సదుపాయాలతో వార్డును నిర్మించారు.

నలుగురు గైనిక్ ప్రొఫెసర్లతో..

ఆస్పత్రిలో మొత్తం నలుగురు గైనిక్ ప్రొఫెసర్లు ద్వారా నాలుగు యూనిట్లు నడుస్తున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషారాణి తెలిపారు. నాలుగు యూనిట్లలో అవసరమైన సిబ్బంది ఉండడం వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా డెలివరీలు చేయగలుతున్నారు. ప్రతి రోజు ఓపీకి 250 నుంచి 350 వరకు బాలింతలు, గర్భిణులు వస్తున్నారు. ఆస్పత్రిలో పలు బ్లాక్‌లో 250 పడకలున్నాయి. ఇందులో పలు ఆపరేషన్ల థియేటర్లు, హైరిస్క్ వార్డు, ఏసీ పడకలు ఉన్నాయి.

సోలార్ ప్రాజెక్టు

నెలకు 5,027 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుండగా.. దీని నిమిత్తం నెలకు రూ.6.50 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు బిల్లు వస్తోంది. విద్యుత్ ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రస్తుతం ఉన్న 50 కేవీ ప్రాజెక్టు కాకుండా మరో ప్రాజెక్టు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సీఎస్ఆర్ కింద రూ.20లక్షలతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. దీని వల్ల ఆస్పత్రికి విద్యుత్ వినియోగం తగ్గే అవకాశం ఉంది.



హైరిస్క్ వార్డు



లాజరస్ వార్డు



చికిత్స పొందుతున్న గర్భిణులు,బాలింతలు

సౌర విద్యుత్‌తో మేలు



సౌర విద్యుత్ వల్ల ఆస్పత్రికి ఎంతో లాభం ఉంటుంది. ప్రస్తుతం విద్యుత్ బిల్లుల రూపేణా పెద్ద మొత్తంలో ఖర్చవుతోంది. విద్యుత్ సమస్య వస్తే చాలా ఇబ్బంది పడవలసి వస్తోంది. వీటిని దృష్టిలో పెట్టుకొని సొంతంగా సౌర విద్యుత్ ప్రాజెక్టు మీద దృష్టి పెట్టాం. జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున కూడా పూర్తి సహకారం అందించారు. దాని వల్ల ప్రతిపాదనలు తయారు చేసి డైరెక్టర్ మెడికల్ హెల్త్‌కు అనుమతి కోసం పంపాం.

–డాక్టర్ పి.ఉషారాణి, సూపరింటెండెంట్, విక్టోరియా ప్రభుత్వ ఆస్పత్రి, విశాఖ

నిధులు ఆదా



సౌర విద్యుత్ ప్రాజెక్టు వల్ల ఆస్పత్రి నిధులు ఆదా అవుతుంది. అంతేకాకుండా కొన్ని సమయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. నెలకు 50 వేల రూపాయల వరకు ఆదా అవుతుంది. అందువల్ల ఈ ప్రాజెక్టు కోసం ప్రతిపాదనలు తయారు చేశాం. త్వరలో శంకుస్థాపన చేసి పనులు మొదలుపెడతాం.

–డాక్టర్ జి.మోహర్ కుమార్, నోడల్ ఆఫీసర్/ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి

వైద్య సేవలు సూపర్



నేను కొడిపందాల వీధిలో నివశిస్తున్నాను. డెలివరీ కోసం ఇదే ఆస్పత్రిలో చేరా. బిడ్డ పుట్టింది. ఇక్కడ వైద్యం చాలా బాగుంది. వైద్యులు అంతా సేవా భావంతో పనిచేస్తున్నారు. అలాగే వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు.

–ఎం.జ్యోతి, కోడిపందాల వారి వీధి, 37వ వార్డు

ఆక్వా కల్చర్‌తో సుస్థిరాభివృద్ధి



సదస్సును ప్రారంభిస్తున్న జానకీరామ్, డెబితాన్ బర్మన్ తదితరులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల జువాలజీ విభాగం ఆధ్వర్యంలో 'జలవనరుల పరిరక్షణ వ్యూహాలు–సుస్థిరత' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్ర యూనివర్సిటీ జువాలజీ విభాగాధిపతి ఆచార్య పి.జానకిరామ్, విశిష్ట అతిథి డాక్టర్ డెబితాన్ బర్మన్ సదస్సు ప్రారంచారు. జలవనరులు, ఆక్వా కల్చర్, సహకార రంగాల్లో సుస్థిరమైన అభివృద్ధి సాధించవచ్చనన్నారు. కార్యక్రమంలో సీఈవో ఆఫ్ ఆక్వా డాక్టర్ సొల్యూషన్స్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, జువాలజీ అధ్యాపకురాలు డాక్టర్ రొజినా, డాక్టర్ స్నేహ, ఇన్‌చార్జ్ డాక్టర్ పి.కె.జయలక్ష్మి, ఇతర కళాశాలల ఫ్యాకల్టీ రీసెర్స్ స్కాలర్స్, సైంటిస్ట్స్, పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివోహం

తెల్లవారు జాము నుంచి శివయ్య దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఉమా చంద్రమౌళేశ్వరస్వామికి పూజలు చేస్తున్న శివరామకృష్ణ దేవస్థానంలో అర్చకుడు

అల్లిపురం: కార్తీకమాసం నాలుగో సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలు కార్తీక శోభ సంతరించుకున్నాయి. ముక్కంటిని దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుంచి బారులు తీరారు. ఈ సందర్భంగా శివయ్యకు పంచామృతాభిషేకాలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. నియోజకవర్గంలో టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామికి ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో విశేష అభిషేకాలు చేపట్టారు. అదేవిధంగా డీబీకే రైల్వే క్వార్టర్స్‌లోని శ్రీ భవాణి శంకర గణపతి ఆలయంలోను, బౌడరా రోడ్డులో గల శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయం, మురళీధరవీధిలోని పంచముఖేశ్వరస్వామి దేవాలయంలో విశేషంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఆకాశ దీపోత్సవంలో భక్తులు విశేష పూజలు నిర్వహించి, దీప దర్శనం చేసుకుని తరించారు. ఈ మేరకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాబాయ్, ఆలయ సిబ్బంది భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు.

ఆరోగ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: అన్ని జాతీయ ఆరోగ్యకార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. సోమవారం రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో యుపీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఇతర కేసులు, ఆరోగ్యశ్రీ కేసులపై అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనిపై సమాచారం ఉంటే ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్(డిఐఒ) డాక్టర్ జీవన్‌రాణి మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు, చిన్న పిల్లలకు నిమోనియా, ఇతర వ్యాధుల మీద అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరావు, ఆరోగ్యశ్రీ మేనేజర్ సత్య శ్రీనుబాబు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి జి.పూర్ణేంద్రబాబు, ఇతర వైద్యులు సత్యవాణి, తులసీ, శశిభూషణ్‌రావు, నాగభూషణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ నియామకం



నియామక పత్రం అందజేస్తున్న ఆనందరావు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సారిపిల్లి సంతోష్ నియమితులయ్యారు. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.ఆనందరావు సోమవారం నియామక పత్రం అందజేశారు.కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రెల్లి సత్యం పాల్గొన్నారు.

మిస్టర్ విశాఖ బాడీ బిల్డింగ్ విజేత భాస్కరరావు

విశాఖ విద్య: మిస్టర్ విశాఖ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ విజేతగా గిడ్డి భాస్కర్ నిలిచారు. ఎస్‌ఏడీ కరాస ఆర్కే ఫిట్నెస్ మంత్ర జిమ్స్‌లో సోమవారం సెకెండ్ మిస్టర్ విశాఖ కోస్టల్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్–2023లను నిర్వహించారు. పోటీలను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 120 మంది పోటీదారులు పాల్గొన్నారు. చాంపియన్‌గా గిడ్డి భాస్కరరావు , బెస్ట్ మస్కులర్‌గా హేమంత్ కుమార్, బెస్ట్ పోజర్‌గా పాల్గొనరావు నిలిచారు. సబ్బవరం ఎంపీపీ, మధురం డెవలపర్స్ ఎండీ రాపేటి రాము, రాజాన నాయుడు, ఆదిత్య నాయుడు చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లా కృష్ణ, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్, జిమ్ నిర్వాహకులు గున్న రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పించండి

అల్లిపురం: బ్యాంకు రుణం తీసుకుని కొనుగోలు చేసిన ప్లాట్స్‌ను భారతి అనే మహిళ దౌర్జన్యంగా ఆక్రమించి, చంపుతానని బెదిరిస్తున్నారని గాజువాకకు చెందిన గొల్లి వెంకట నాగేషు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నగరంలో ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని వివరాలు వెల్లడించారు. తాను గతంలో బుద్ధ లేటు కృష్ణంనాయుడు కుమారుడు బుద్ధ అప్పారావు నుంచి రూ.కోటి 30 లక్షలతో మూడు ప్లాట్లు కొనుగోలు చేశానని, నగదు కూడా ఆన్‌లైన్ ద్వారా చెల్లించినట్లు వివరించారు. ఈ మధ్యకాలంలో భారతి అనే మహిళ కబ్జా చేయడమే కాకుండా గాజువాక సీఐ భాస్కరరావు, గోవింద్ అనే కానిస్టేబుల్ అండ తమకు ఉందని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే దాడి చేస్తామని బెదిరించారన్నారు. ఈ వివరాలతో నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. తనపైన, తన కుటుంబపైన దాడికి పాల్పడుతున్న వ్యక్తుల నుంచి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

ఆటో కార్మికుల ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార : బీచ్‌రోడ్డులో తిరుగుతున్న ఎలక్ట్రానిక్ ఆటోలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టింది. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు, షేక్ రెహ్మాన్ మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్‌నుంచి రుషికొండ వరకు సుమారు ఐదు వందలు ఆటోలు తిరుగుతున్నాయన్నారు. ఎలక్ట్రానిక్ ఆటో వల్ల మా ఉపాధి దెబ్బతింటోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోలిరెడ్డి, వాసు, శేఖర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలిపాడ్యమికి విశేష ఏర్పాట్లు

సింహాచలం: పోలిపాడ్యమిని పురస్కరించుకుని బుధవారం సింహాచలం దేవస్థానానికి చెందిన కొండదిగువ వరాహపుష్కరిణి వద్ద దీపాలు విడిచిపెట్టే భక్తుల సౌకర్యార్థం విశేషంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి తెలిపారు. వరాహ పుష్కరిణి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం రాత్రి దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసానికి వీడ్కోలు పలుకుతూ పుష్కరిణి వద్ద దీపాలు విడిపిచిపెట్టేందుకు మంగళవారం అర్ధరాత్రి నుంచి వరాహపుష్కరిణికి భారీగా భక్తులు అధికంగా తరలివస్తారన్నారు. ఈఏడాది కూడా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 16మంది దేవస్థానం గార్డులు పుష్కరిణి వద్ద విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. అలాగే 8 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. తొలిపావంచా వద్ద, వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గంలోను వాహనాలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవో పాలూరి నరసింగరావు, సూపరింటెండెంట్ యనమండ్ర అప్పారావు, ఏఈ రాజా తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

విజయవాడ: డివైడర్ దాటుతున్న మహిళను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖపట్నానికి చెందిన బోని పద్మ(38) కార్తిక సోమవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భవానీపురం బాల భాస్కర్ నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చింది. కార్తిక సోమవారం కావడంతో ఉదయం 5.15 గంటల సమయంలో పద్మ తన వదిన పైడి రాజమ్మతో కలిసి దుర్గగుడికి బయలుదేరింది. కనకదుర్గ ఫ్లై ఓవర్ వద్ద డివైడర్ దాటుతుండగా వేగంగా వచ్చిన కారు పద్మను ఢీ కొట్టింది. తలకు బలమైన గాయమై పద్మ అక్కడికక్కడే మృతి చెందింది.

స్వలాభం కోసం వచ్చి.. ప్యాకేజీ కోసం పోయాడు..

39వ వార్డు కార్పొరేటర్ సాధిక్‌పై విరుచుకుపడిన వైఎస్సార్‌సీపీ నేతలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం

జగదాంబ: స్థానిక 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్ కేవలం స్వలాభం కోసమే వైఎస్సార్ సీపీలో చేరి, ప్రయోజనాలు పొంది, ప్రస్తుతం వేరే పార్టీ ప్యాకేజీల కోసం పాకులాడుతున్నాడని పార్టీ 36,38,39,మండల అధ్యక్షులు,39వ వార్డు ఇంచార్జ్ కొల్లి సింహాచలం విమర్శించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగలేదని పార్టీని, పార్టీ నాయకులను నిందిస్తూ, పచ్చి అబద్ధాలాడుతూ పార్టీని వీడిపోతున్నట్టు ప్రకటించడం సరైనది కాదన్నారు. పార్టీకి, నమ్ముకున్న ప్రజలకు ద్రోహిగా నిరూపించుకున్నాడన్నారు. సోమవారం 39వ వార్డు పరిధి లక్ష్మీ టాకీస్ జంక్షన్ వద్ద శెట్టి బలిజ కమ్యూనిటీ హాల్‌లో పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొల్లి సింహాచలం మాట్లాడుతూ 39వ వార్డు సాధిక్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిచి తనకు తానుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌పైన నిందారోపణలు చేయడం తగదన్నారు. ప్రభుత్వం ద్వారా నియోజకవర్గానికి భారీగా నిధులొచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను విమర్శిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. 39వ వార్డులో నాడు–నేడు వైఎస్సార్ ప్రభుత్వ పథకం కింద షాదీఖానా రూ. 2 కోట్లు, రూ.కోటితో జిమ్ అభివృద్ధి చేయడం నిజం కాదా? అని కొల్లి సింహాచలం ప్రశ్నించారు. అదేవిధంగా క్వీన్ మేరీ స్కూల్‌ను కోటి రూపాయలతో అభివృద్ధి చేశారని, కోట్లాది రూపాయలతో ఇక్కడ మురుగు కాలువలు చానల్స్‌ను అభివృద్ధి చేశారన్నారు. పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ యాసీన్, సలీం, ఆదిల్, ఖమాల్, ఇబ్రహీం, మాధురి, రమణమ్మ, సీమెన్ శ్రీను, బంగారి, పెంటయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం



గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న కర్రి నీలకంఠం, తదితరులు

అల్లిపురం: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని 33,34,35,41 వార్డుల మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం అన్నారు. మరింత సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే 2024 ఎన్నికల్లో మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు వార్డు గృహసారథులు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆదేశాల మేరకు 34వ వార్డు పరిధి యాతపేట సచివాలయం పరిధిలో సోమవారం పి.సత్యనారాయణ, అంబటి అప్పలరాజు, నాగమణి ఆధ్వర్యంలో ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, తాతబ్బాయి, దూడ అప్పారావు, భాస్కరరావులు పాల్గొని సచివాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ అభివృద్ధికి చెక్కు అందజేస్తున్న శ్రీవత్సవ్

దాబాగార్డెన్స్: చిలకపేట ఉమా నీలకంఠేశ్వర శివాలయంలో స్వామి వివేకానంద సంస్థ పంచామృతాలు, మారేడు దళాలతో ప్రత్యేక పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకపేటలో గల శివలింగం కాశీ నుంచి తీసుకువచ్చి ప్రతిష్ఠించారని, ఈ శివలింగానికి ఓ ప్రత్యేకత ఉందన్నారు. శివాలయం ధర్మకర్త టి.తాతారావుకు శ్రీవత్సవ్, సూరాడ దానియమ్మ చేతుల మీదుగా రూ.5వేలు స్వామి వివేకానంద సంస్థ అందజేసింది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, చిన్న శ్రీను, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల కోసం వినతి

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయం నుంచి ఏవీఎన్ కాలేజీ వరకు తక్షణ పూర్తి స్థాయిలో రహదారులు వేయాలని 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం కోరారు. సోమవారం జీవీఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మకు పలు అంశాలపై వినతి పత్రం సమర్పించారు.

పూర్ణా మార్కెట్ ఆశీలు రద్దు చేయండి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ వద్ద ఆశీలు రద్దు చేయాలని వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు కౌన్సిల్ సమావేశంలో విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌కు వచ్చే వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున ఆశీలు వసూలు చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వార్డు పరిధి ఆయిల్ మిల్లు రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు.